క్లుప్తంగా

గ్రామ సచివాలయ సేవలపై అవగాహన



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వై.రామవరం: సచివాలయ కార్యదర్శులతో ఎంపీడీవో బి.శ్రీనివాసులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సచివాలయ సేవలు సకాలంలో అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సేవలు తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణపై సలహాలు సూచనలిచ్చారు. కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

165 మందికి వైద్య పరీక్షలు



ఆర్డీపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గంగవరం: మండలంలోని రాముల్దేవపురం (ఆర్.డి.పురం)లో డాక్టర్ చిన్నిబిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 165 మందికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు డాక్టర్ సత్యనారాయణ చెప్పారు. సీపీఐ(ఎంఎల్) నాయకులు అర్జునరావు, ప్రసాద్, శ్రీను, రాజు, గోవింద్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో తనిఖీలు



మోహనాపురం ఆర్‌బీకేను తనిఖీ చేసిన ఏవో విశ్వనాథ్

గంగవరం : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించాలని వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందిని మండల వ్యవసాయాధికారి కె. విశ్వనాథ్ సూచించారు. మోహనాపురం , జడేరు రైతు భరోసా కేంద్రాలను ఆయన సోమవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారికి తగిన సేవలు అందించాలని సూచించారు.

శరవేగంగా రహదారి విస్తరణ పనులు



చింతపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి పనులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో జాతీయ రహదారి–516 ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చింతపల్లి, అంతర్ల, పెంటపాడు ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా 12 మీటర్ల మేర విస్తరించనున్నారు. రాజమండ్రి నుంచి విజయనగరం వరకు వయా చింతపల్లి, పాడేరు, అరకు మీదుగా రహదారి నిర్మాణం జరగనుంది. తాజాగా చాపరాలిపాలెం, లంబసింగి సెక్షన్లలో 39 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు ఎన్‌హెచ్ అధికారులు ప్రారంభించారు.

చిన్న మృతికి సంతాపం



మాదాసు చిన్న (ఫైల్)

సాక్షి,పాడేరు: మన్యంలో మైక్‌సెట్ చిన్నగా పేరొందిన మాదాసు చిన్న(50) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కిడ్నీ, ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 30ఏళ్ల నుంచి మైక్‌సెట్, లైటింగ్ నిర్వహణలో చిన్నకు ఏజెన్సీలో మంచి పేరుంది. ఆయన మృతికి సంతాప సూచకంగా దుకాణాలను మూసివేశారు.చిన్న మృతికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నరసింగరావుతో పాటు కాపు సామాజిక సంఘం నేతలు,వర్తక సంఘం ప్రతినిధులు, ఉప సర్పంచ్ రాముునాయుడులు విచారం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- బారులు తీరిన ఓటర్లు
- ఎన్నిక పర్యవేక్షించిన అధికారులు
- పటిష్టంగా పోలీసు బందోబస్తు



అరకులోయలో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీఐ జీడీ బాబు



ముంచంగిపుట్టులోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



అనంతగిరిలో బారులు తీరిన ఓటర్లు



ఒకే వీధిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



జీకే వీధిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్

అరకు రూరల్/ పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 76.19 శాతం ఓటింగ్ నమోదైనట్టు తెలిసింది. పట్టణంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో 1819 ఓటర్లకు గాను 1386 పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు ఓటర్లకు సూచనలిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శివ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై తహసీల్దార్ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అరకులోయ సీఐ జి.డి.బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. గుర్తింపు కార్డులను పరిశీలించి, ఓటర్లను అనుమతించారు.గన్నెల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

హుకుంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్‌పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల జోనల్ అధికారి రమేష్‌రామన్, పాడేరు సీఐ సుధాకర్ పర్యవేక్షించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, ఎస్‌ఐ సతీష్ పోలింగ్ పరిశీలించారు. మండలంలోని 1720 ఓటర్లకు గాను 1196 పోలింగ్ అయింది. 66.77 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలిసింది.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1059 ఓట్లు ఉండగా 777 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ముంచంగిపుట్టులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్సమ్మ, ఎస్‌ఐ కె.రవీంద్ర తదితరులు పర్యవేక్షించారు.

అనంతగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలోని 595 ఓటర్లకు గాను 497 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని జేసీ శివ శ్రీనివాసు తదితరులు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

దుంబ్రిగుడ: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో 912 ఓటర్లకుగాను 652 ఓటు హక్కును వినయోగించుకున్నారు.

పెదబయలు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలోని 1186 మంది ఓటర్లకుగా 817 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 68.8 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలిపారు. ఎన్నికల ప్రొసైడింగ్ అధికారి జి.శ్రీనివాసరెడ్డి, జోనల్ అధికారి మురళి, తహసీల్దార్ భాస్కరరావు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తదితరులు పర్యవేక్షించారు. ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్‌ఐ, వీఆర్వో సత్యరావు తదితరులున్నారు.

చింతపల్లిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలోని 1021 ఓట్లకు గాను 646 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ సందర్శించి, పోలింగ్‌ను పరిశీలించారు.

చింతపల్లి అదనపు ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో సీఐ రమేష్, ఎస్‌ఐలు అరుణ్‌కిరణ్, రమణ బందోబస్తు నిర్వహించారు.

కొయ్యూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమెతో పాటు ఆమె సోదరుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేశ్ కూడా ఓటు వేశారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సందర్శించి, పోలింగ్‌ను పరిశీలించారు. మండలంలోని 664 మందికి గాను 514 మంది ఓటు వేసినట్టు తెలిసింది. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు రాజారావు, లోకేష్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

జి.మాడుగుల: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో 637 మందికి గాను 461 మంది ఓటు వేసినట్టు తెలిసింది. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మత్స్యరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ పర్యవేక్షించారు. ఇక్కడ పోలింగ్ కేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సందర్శించి పోలింగ్ వివరాలపై ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకున్నారు. జోనల్ అధికారిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌బిఎస్ నందు, రూట్ అధికారిగా పంచాయతీరాజ్ డీఈఈ నరేస్‌కుమార్ పరిశీలించారు.

గూడెంకొత్తవీధి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండల పరిధిలో మొత్తం 384 ఓట్లకు గాను 301 ఓట్లు వేసినట్టు తెలిసింది.

పోలింగ్ కేంద్రాన్ని పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ తనిఖీ చేశారు.



అరకులోయలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శివ శ్రీనివాస్





పెదబయలు, కొయ్యూరు పోలింగ్ కేంద్రంలో వద్ద బారులు తీరిన ఓటర్లు



జి.మాడుగులలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాజు



జి.మాడుగులలో ఓటర్ల స్లిప్‌లను తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ, పోలీసులు



చింతపల్లిలో ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



ప్రత్యేక వాహనం ద్వారా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఇంటర్ ప్రశ్నపత్రాలు



వై.రామవరంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తాతారావు

రాజవొమ్మంగి: ఇంటర్ పరీక్షలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ప్రశ్న పత్రాలు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయలు కల్పించారు. మండల కేంద్రంలో గురుకుల జూనియర్ కాలేజీలోని సెంటర్‌లో నిర్వహించనున్న పరీక్షలకు మొత్తం 547 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహనరావు తెలిపారు. ప్రతి గదిలో 24మంది పరీక్ష రాయనున్నట్టు చెప్పారు.రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల, ఏలేశ్వరం మండలాలకు కూడా సోమవారం ప్రశ్నాపత్రాలు చేరుకొన్నాయి.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఎ.తాతారావు సోమవారం పరిశీలించారు. కేంద్రంలో సదుపాయాలను తనిఖీ చేవారు. అనంతరం పరీక్షల నిర్వహణపై ప్రిన్సిపల్ ఈశ్వరకృపతో చర్చించి, పలు సలహాలు సూచనలిచ్చారు. ఈ కేంద్రంలో 263 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, సిబ్బంది రాంబాబు తదితరులున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం: అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ, జీసీసీల ఎదుట సోమవారం గిరిజనులు ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. కొండచీపుల్లు, జీడిమామిడి తదితర ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న నాయకులతో జీసీసీ డీఎం పార్వతీశం మాట్లాడుతూ జీసీసీ ఎండీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు అనసూయ, బాలుదొర, లచ్చిరెడ్డి, బాలురెడ్డి, వాడపల్లి సర్పంచ్ పండమ్మ , సుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులతో మాట్లాడుతున్న డీఎం పార్వతీశం

వారపు సంత వెలవెల



వారపు సంత

అనంతగిరి: మండల కేంద్రంలోని సోమవారం జరిగే వారపు సంతవెలవెలబోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోని పరిసర గ్రామాలు నుంచి గిరిజనులు వారపు సంతకు రాకపోవడంతో వెలవెలబోయింది. ఈ వారం గిరిజనులు అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు తసుకునిరాలేదు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వారపు సంతకు పెద్ద ఎత్తున కూరగాయాలను విక్రయించేందుకు తెచ్చారు. కొనుగోలుచేసేందుకు గిరిజనులు రాకపోవడంతో సంత వెలవెలబోవడంతో వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

నూకాంబిక గరగ ఊరేగింపు

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన కశింకోట నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి గరగలు, అమ్మ వారి పాదాలను అందంగా అలంకరించిన రిక్షాలో నిలిపి సంప్రదాయంగా డప్పులతో గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం గరగ, పాదాలను ఆలయంలో యథావిధిగా నిలిపారు. ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్, వేగి రామరాజుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నేడు మోదకొండమ్మ తీర్థం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నేల వేషాలు, విద్యుత్ లైటింగ్ నడుమ అమ్మవారి తీర్థం జరగనుందన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీలో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం మెట్లు పడిపోయే పరిస్థితులో ఉన్నాయని సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయ ఆరోపించారు. వారు మాట్లాడుతూ పనులు నాణ్యతగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి, తదితరులున్నారు.

సీపీఐ సమితి సమావేశం రేపు

చింతపల్లిరూరల్: సీపీఐ అల్లూరి జిల్లా సమితి సమావేశం చింతపల్లిలో బుధవారం నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ కార్యదర్శులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి

అడ్డతీగల: చిన్నారుల్లో రక్తహీనతకు దోహదం చేస్తూ శారీరకంగా బలహీనులుగా మార్చే నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని ఎల్లవరం పిహెచ్‌సి వైద్యాధికారి కె.భాస్కర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా పర్యటించి, అల్బెండజోల్ మాత్రలను అందజేస్తారన్నారు. ఆయా మాత్రల వల్ల చిన్నారుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే నులిపురుగులు నివారించవచ్చన్నారు. వందశాతం చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ పూర్తిచెయ్యాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు.

పీఎంఈజీపీపై రేపు అవగాహన

పాడేరు రూరల్ : చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న ఉదయం 11గంటలకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకురాలు డాక్టర్ వి.పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలు స్థాపనకు ఆసక్తి ఉన్న నిరుద్యోగ గిరిజన యువత ఈ సదస్సుకు హాజరు కావాలన్నారు.

సమష్టిగా పార్టీ శ్రేణులు కృషి



జి.మాడుగులలో హోటల్‌లో టీ తాగుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఓటింగ్ సరళిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరిశీలించారు. అనంతరం నుర్మతి రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న హోటల్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ తాగారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్నికల పరిశీలకుడు పాడేరు ఎంపీపీ వీవీ రమణమూర్తి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ కొండబాబు, నాయకులు చిట్టిబాబు, కొండబాబు, లక్ష్మణ్, మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూరుబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. వాహన రికార్డులతో పాటు బస్సులు, జీపులు ఇతరత్రా వాహనాల్లో ప్రయాణికులు లగేజీలను క్షుణ్ణంగా సోదా చేశారు. లైసెన్స్, ఇతరత్రా పత్రాలు లేని వాహనచోదకులకు కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సీఆర్‌పీఎఫ్– డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్ర

కూనవరం: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, ఎంపీడీఓ ఫణీంద్ర, తహసీల్దార్ కె.అనసూయలు హాజరైన సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. గండికొత్తగూడెం, కూటూరు గట్టూ, కొడేరు, లింగాపురం గ్రామాల్లో తాగునీటి పథకాలు పనులు చేపట్టాలని కోరారు. పోచవరం పంచాయతీలో బోరు పాడైందని, బందారుగూడెం, భగవాన్‌పురంలో తాగునీటి సమస్య ఉందని, పాలగూడెంలో సీడబ్ల్యూ పథకం పనిచేయడం లేదని వివరించారు. వరద బాధితులందరికీ పరిహారం అందేలా తీర్మానించాలన్నారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు కొమ్మాని అనంతలక్ష్మి, గారపాటి వెంకటేశ్వరరావు, ధర్ముల ఆమ్మాజీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



భక్తులతో కలిసి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్

హుకుంపేట: మండలంలోని అండిభ పంచాయతీలో బంగారుముడి గ్రామంలో శివాలయం ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం సాగించవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మండల పార్టీ కో–కన్వీనర్ కే.కోటిబాబు, నాయకులు అశోక్‌కుమార్, అజయ్, సమరసత సేవ ఫౌండేషన్ ప్రతినిధి సహదేవ్, దేవదాయ శాఖ మండల కన్వీనర్ కొండబాబు, ప్రభాకర్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.